ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

శుక్రవారం 17 మే 2024





పోలింగ్ కేంద్రాల నుంచి స్ట్రాంగ్ రూముకు ఈవీఎంలను తీసుకొస్తున్న ఎన్నికల సిబ్బంది (ఫైల్)

మూడు రోజులూ.. అవస్థలే!

- తీవ్ర ఇబ్బందుల పాలైన పోలింగ్ సిబ్బంది
- కొన్ని కేంద్రాల్లో మౌలిక సౌకర్యాల కొరత
- తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలు నిల్
- భోజనాలు, నిద్ర కరువు
- ఈవీఎంలతో పోలింగ్ స్టేషన్ల నుంచి కౌంటింగ్ కేంద్రాలకు చేరుకునేందుకు ఇక్కట్లు
- రెమ్యూనరేషనూ అంతంతే...
- పెదవి విరుస్తున్న ఉద్యోగులు



పోలింగ్ మరుసటి రోజు ఉద్యాన కళాశాల ఆవరణలో సిబ్బంది ఇలా.. (ఫైల్)

పార్వతీపురం, మే16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బంది ఆది నుంచీ కష్టాలు పడ్డారు. మూడు రోజుల పాటు ఆపసోపాలు పడ్డారు. ఈవీఎంలు అప్పగించే వరకు నానా అవస్థలు పడ్డారు. కొన్నిచోట్ల పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించకపోవడంతో నిద్రకు, భోజనాలకు కరువై.. నరకయాతన అనుభవించారు. ఆఖరికి రెమ్యూనరేషన్ కూడా అంతంతమాత్రంగా అందించడంతో ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో పోలింగ్ సిబ్బంది ఈనెల 12న ఉదయాన్నే పార్వతీపురం, కురుపాం, పాలకొండ, సాలూరు నియోజకవర్గ కేంద్రాల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకున్నారు. అక్కడ వారికి అందించిన ఈవీఎం, పోలింగ్ మెటీరియల్‌ను స్వీకరించారు. అనంతరం వారికి కేటాయించిన బస్సుల్లో గమ్యస్థానానికి చేరుకున్నారు. పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. మరుసటి రోజున 13వ తేదీ ఉదయం 5.30కి ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. అయితే అనేక చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. దీంతో పోలింగ్ కాస్త జాప్యమైంది. ఈ క్రమంలో కొన్నిచోట్ల పోలింగ్ కేంద్రాల వద్ద రాత్రి ఎనిమిది గంటల వరకు ఓటింగ్ కొనసాగిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు పోలింగ్ రోజు సాయంత్రం వివిధ ప్రాంతాల్లో ఈదురు గాలులతో వర్షం కురిసింది. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అయినప్పటికీ అతి కష్టం మీద పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో సిబ్బందికి అవస్థలు తప్పలేదు. ఓటింగ్ ముగిసిన తర్వాత వారు ఈవీఎంలను పట్టుకుని స్ట్రాంగ్ రూములకు బయలుదేరగా.. పోలింగ్ కేంద్రాలకు వెళ్లిన బస్సులన్నీ ఒకే సారి రావడంతో ట్రాఫిక్ జాం అయ్యింది. దీంతో గరుగుబిల్లి మండలం ఉద్యాన కళాశాల ఆవరణలోనే రాత్రి 8 నుంచి అర్ధరాత్రి సమయం వరకు బస్సుల్లోనే సిబ్బంది వేచి ఉండాల్సి వచ్చింది. ఈ పరిస్థితిలో రాత్రి భోజనానికి వారు నోచుకోలేదు. ఈవీఎంలు విడిచి పెట్టి మధ్యలో భోజనం చేయడానికి సాహసించలేక పోయారు. ఆఖరుకు 14వ తేదీ మధ్యాహ్నం వరకూ స్ట్రాంగ్‌రూమ్ వద్దే ఉండాల్సి వచ్చింది. దాదాపు మూడు రోజుల పాటు వారు విధులు నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల్లో ఇలా..



గరుగుబిల్లి: మరుపెంటలో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ఎన్నికల సిబ్బంది (ఫైల్)

జిల్లాలో నాలుగు నియోజకవర్గాల పరిధిలోని అనేక పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు లేవు. కొన్నిచోట్ల తాగునీరు, భోజనాలు, మరుగుదొడ్లు, స్నానపు గదులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయలేదు. దీంతో పోలింగ్ ముందు రోజు రాత్రి పోలింగ్ కేంద్రాలకు వెళ్లిన సిబ్బందికి ఇక్కట్లు తప్పలేదు. నేలపైనే పడుకోవాల్సి వచ్చింది. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మరుగుదొడ్లు ఉన్నా.. రన్నింగ్ వాటర్ సదుపాయం లేకపోవడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. మరోవైపు 13వ తేదీ రాత్రి వరకు పోలింగ్ కొనసాగగా.. తినడానికి సరైన ఆహారం లేక వారు ఆకలితో విధులు నిర్వహించాల్సి వచ్చింది. మొత్తంగా సమస్యల నడుమే సిబ్బంది విధులు నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితి మరీ దారుణంగా ఉండడంతో స్థానికంగా ఉన్న ప్రజలు వారికి సహకరించారు. భోజనాలు, తాగునీరు అందించారు. ఇదిలా ఉండగా రవాణా సదుపాయం లేని పోలింగ్ కేంద్రాలకు బస్సులు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఏర్పాటు చేశారు. అయితే వాటిల్లో సిబ్బంది అతికష్టం మీద పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి వచ్చింది. పోలింగ్ జాప్యం జరిగిన కేంద్రాల సిబ్బంది ఆకలితో అలమటించారు.



వీరఘట్టం మండలం తెట్టంగిలోని ఓ పోలింగ్ కేంద్రంలో చీకట్లోనే విధులు నిర్వహిస్తున్న సిబ్బంది (ఫైల్)

రెమ్యూనరేషన్ చెల్లింపుల్లో వ్యత్యాసం..

ఎన్నికల సిబ్బందికి రెమ్యూనరేషన్ చెల్లింపుల్లో తేడా ఉండడంతో ఉద్యోగులు బహిరంగంగానే పెదవి విరుస్తున్నారు. ఇతర జిల్లాలతో పోల్చితే రెమ్యూనరేషన్ తక్కువగా ఇచ్చారని పలువురు పోలింగ్ సిబ్బంది చెబుతున్నారు. కొన్నిచోట్ల పీవోకు రూ. 1750, ఏపీవోకు రూ. 1250లు, ఓపీవోలకు రూ. 500లు చొప్పున అందించారు. మరికొన్ని ప్రాంతాల్లో పీవోకు రూ. 2050లు, ఏపీవోకు రూ. 1550లు, ఓపీవోలకు రూ.1050లు చొప్పున అందించారు. ఒక్కో చోట ఒక్కో విధంగా చెల్లింపులేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. దీనిని వెంటనే సరిచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పలుచోట్ల ఇలా..

- **సీతంపేట:** సీతంపేట మండలంలో పలుచోట్ల ఫోన్ సిగ్నల్స్ లేకపోవడంతో పోలింగ్ సిబ్బందికి ఇక్కట్లు తప్పలేదు. ఈనెల 12వ తేదీ సాయంత్రం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నప్పటి నుంచి 13వ తేదీ రాత్రి పోలింగ్ ముగిసేవరకు వారి ఫోన్లకు సిగ్నల్స్ లేవు. దీంతో వారు ఉన్నతాధికారులతో కూడా మాట్లాడలేని పరిస్థితి ఏర్పడింది. మండలంలో 105 పోలింగ్ కేంద్రాలు ఉండగా వీటిలో 37 పోలింగ్ కేంద్రాలకు పూర్తిస్థాయి నెట్‌వర్క్ సౌకర్యం లేదు. ఇవన్నీ కొండశిఖర గ్రామాలు కావడంతో సిగ్నల్ సమస్య వేధించింది. మరోవైపు తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కొన్ని పోలింగ్ కేంద్రాలు ఇరుకుగా ఉండగా, భోజనం, తాగునీరు, మరుగు దొడ్ల సౌకర్యాలు కూడా కరువయ్యాయి. మరికొన్నిచోట్ల గ్రామ సర్పంచ్‌లు పోలింగ్ సిబ్బందికి భోజన సౌకర్యాలు కల్పించారు.
- **పాలకొండ:** నియోజకవర్గంలో పలుచోట్ల పోలింగ్ సిబ్బంది చీకట్లోనే విధులు నిర్వహించాల్సి వచ్చింది. ఈనెల 13వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రాత్రి 9 గంటలైనా కరెంట్ రాలేదు. దీంతో సిబ్బందికి ఇబ్బందులు తప్పలేదు. సెల్‌ఫోన్ లైట్లు, టార్చిలైట్ల వెలుతురులోనే విధులు నిర్వహించాల్సి వచ్చింది. కొన్నిచోట్ల పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మరుగుదొడ్ల నిర్వహణ లేకపోవడంతో సిబ్బంది నానా అవస్థలు పడ్డారు.
- **గరుగుబిల్లి:** మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల పరిధిలో భోజన సౌకర్యాలను ఏర్పాటు చేసినా.. సక్రమంగా మెనూ అమలు కాలేదు. మరోవైపు ప్రతి పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లకు రూ.5 వేలు మేర అందించాల్సి ఉండగా రూ.2 వేలు అందించి చేతులు దులుపుకున్నారు. కేంద్రాల పరిధిలో టెంట్లు, కుర్చీలు, తాగునీటి అవసరాలకు రూ.3 వేలుకు గాను రూ.2 వేలు చొప్పున బీఎల్‌వోలకు అందించి మమా అనిపించారు. దూర ప్రాంతాల్లో విధులు నిర్వహించిన వారు అష్టకష్టాలు పడ్డారు. ఈవీఎంలతో స్ట్రాంగ్ రూములకు బయల్దేరిన సిబ్బందికి ఒకవైపు విద్యుత్ కోత, మరోవైపు ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యాయి. మరో వైపు బస్సుల కోసం నిరీక్షించాల్సి వచ్చింది.
- **సాలూరు రూరల్:** సాలూరు నియోజకవర్గంలో కురుకూటి, పాంచాళి, కూర్మరాజుపేట, చిన్నవీధి, గుమడాంల్లో రాత్రి పది వరకు ఓటింగ్ జరిగింది. అయితే సరైన వెలుతురు లేకపోవడంతో సిబ్బంది, ఓటర్లకు అవస్థలు తప్పలేదు. పోలింగ్ ముందు రోజు రాత్రి దోమల బెడదతో సిబ్బంది ఇబ్బంది పడ్డారు. వారికి అందించిన భోజనాల్లో నాణ్యత లోపించింది. మెనూ కూడా సక్రమంగా అమలు కాలేదు. దీనికి తోడు సాలూరు పోలింగ్ కేంద్రాల నుంచి నేరుగా ఉల్లిభద్రలో కౌంటింగ్ కేంద్రంలో ఈవీఎంలు అప్పగించాలనే నిబంధన పీవో, ఏపీవోలకు నరకప్రాయంగా మారింది. ఉల్లిభద్ర రోడ్డుకు 13వ తేదీ రాత్రి పది గంటలకు చేరిన వాహనాలు కాలేజీ ఆవరణలోకి వెళ్లే సరికి మరుసటి రోజు ఉదయం ఆరు గంటలైంది. మరికొన్ని వాహనాలు ఉదయం 11 గంటలకు చేరాయి. పోలింగ్ సిబ్బందికి రాత్రి భోజనం, నిద్ర లేకుండా పోయింది.

ఇన్‌చార్జి డీఆర్వోకు ఫిర్యాదు..

రెమ్యూనరేషన్ చెల్లింపుల్లో తేడాలను యూటీఎఫ్ జిల్లా శాఖ నాయకులు గురువారం కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి డీఆర్వో కేశవనాయుడుకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆయన రిటర్నింగ్ అధికారులకు ఫోన్ చేసి తేడాలను సవరించాలని ఆదేశాలిచ్చారు. పాలకొండ నియోజకవర్గంలో రిజర్వ్‌లో ఉన్న ఉపాధ్యాయులకు వెంటనే రెమ్యూనరేషన్ చెల్లించాలన్నారు. పీవో, ఏపీవోలుగా రిజర్వ్‌లో ఉన్నవారికి ఓపీవో డ్యూటీ వేసిన వారికి ట్రైనింగ్ డబ్బులు చెల్లిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అదనంగా ట్రైనింగ్ ఇచ్చిన వారికి కూడా చెల్లిస్తామన్నారు. ఆర్‌వోలతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. డ్యూటీ సర్టిఫికెట్స్ వెంటనే ఇచ్చేటట్లు చూస్తామన్నారు. పీవో, ఏపీవోలకు సమానంగా రెమ్యూనరేషన్ చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీ మోహన్‌రావులు విన్నవించగా క్లారిఫికేషన్ తీసుకుంటామని ఇన్‌చార్జి డీఆర్వో తెలిపారు.

వ్యత్యాసం ఎందుకు?

ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బందికి రెమ్యూనరేషన్ చెల్లింపు విషయంలో వ్యత్యాసం ఎందుకో అర్థం కావడం లేదు. ఒక్కో చోట ఒక్కోలా చెల్లింపులుంటాయా? ఈ వత్యాసాన్ని సరిచేసి సిబ్బందికి న్యాయం చేయాలి. దీనిపై కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించాలి. నిబంధనలు ప్రకారం అందరికీ రెమ్యూనరేషన్ చెల్లించాలి.

-అమరాపు సూర్యనారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు, పీఆర్‌టీయూ అసోసియేట్, పార్వతీపురం

ఎన్నికలు ముగిశాయని నిర్లక్ష్యం వద్దు

- కౌంటింగ్ పూర్తయ్యే వరకూ అప్రమత్తంగా ఉండాలి
- విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ విశాల్ గున్నీ

విజయనగరం క్రైం, మే 16: ఎన్నికలు ముగిశాయని నిర్లక్ష్యం వద్దని, కౌంటింగ్ పూర్తయ్యే వరకూ అప్రమత్తంగా ఉండాలని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ అధికారులను ఆదేశించారు. గురువారం విజయనగరం ఎస్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రేంజ్ పరిధిలోని విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలు, పోలీసు అధికారులతో సమీక్షించారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకూ సమస్యాత్మక గ్రామాల్లో పికెటింగ్‌లు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. చెదురుమదురు ఘటనలు మినహా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించగలిగామన్నారు. మరో 18 రోజులు ప్రతి ఒక్కరూ నిబద్ధతో పనిచేయాలని ఆదేశించారు. ఈవీఎంలు భద్రపరిచిన కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో చురుగ్గా ఉన్న వ్యక్తులు, రాజకీయంగా వివాదాలు సృష్టించే వారిని గుర్తించి పోలీసు స్టేషన్‌లో కౌన్సెలింగు ఇవ్వాలని సూచించారు. ఓటు వేసేందుకు ఇతర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన వారితో సమస్యలు ఉంటే.. గుర్తించాలన్నారు. ఆయా గ్రామాల్లో పరిస్థితులు, సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. వివాదాలకు అవకాశం ఉన్న గ్రామాలను గుర్తించి నిరంతరం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. వచ్చే నెల 4న కౌంటింగ్ నిర్వహించే కేంద్రాల వద్ద పటిష్ఠ భద్ర తలను ఏర్పాటు చేయాలని ఎస్పీలను ఆదేశించారు. సమావేశంలో విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలు దీపిక, విక్రాంత్ పాటిల్, తుహీం సిన్హా, అదనపు ఎస్పీలు, ట్రైనీ ఐపీఎస్, డీఎస్పీలు, ట్రైనీ డీఎస్పీలు, సీఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌కు పోస్టల్ బ్యాలెట్లు

గరుగుబిల్లి, మే16: అరకు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో పోస్టల్ బ్యాలెట్లను గురువారం స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధి పాడేరు, రంపచోడవరం, అరకుతో పాటు పార్వతీపురం మన్యం జిల్లాలో కురుపాం, సాలూరు, పార్వతీపురం, పాలకొండకు చెందిన పోస్టల్ బ్యాలెట్లను గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర ఉద్యాన కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అరకు పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ నిశాంత్ కుమార్ పరిశీలన అనంతరం స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేశారు. ఈ స్ట్రాంగ్ రూము వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. అరకు పార్లమెంటరీ సహాయ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.శోభిక, నాలుగు నియోజకవర్గాల ఆర్వోలు శుభం బన్సల్, సి.విష్ణుచరణ్, వీవీ రమణ, కె.హేమలత, కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జి, ఎస్‌డీసీ ఆర్.సూర్యనారాయణ, ఇన్‌చార్జి డీఆర్వో కేశవనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేయిస్తున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

హామీ ఇచ్చారు.. మరిచారు!

- జంపరకోట జలాశయానికి మోక్షమెప్పుడో...
- జగన్ హామీ గాలిలో..
- ఐదేళ్ల పాలనలో ఒక్కపైసా కూడా కేటాయించని వైనం
- ముందుకు సాగని రిజర్వాయర్ పనులు
- వైసీపీ సర్కారు తీరుపై ఆయకట్టుదారుల ఆగ్రహం

పాలకొండ: అధికారంలోకి వచ్చిన వెంటనే జంపరకోట జలాశయ పనులను పూర్తి చేసి.. రైతులను ఆదుకుంటానని 2019 ఎన్నికల సమయంలో జగన్ హామీ ఇచ్చారు. అయితే ఐదేళ్ల పాలనా కాలంలో ఆ దిశగా ఒక్క అడుగు కూడా వేయలేదు. ఎకరా భూమికి కూడా నీరందించ లేదు. రివర్స్ టెండరింగ్‌కు పిలుపునిచ్చినా.. నిధులు మాత్రం మంజూరు చేయలేదు. దీంతో రిజర్వాయర్ పనులు ముందుకు సాగలేదు. మొత్తంగా వైసీపీ సర్కారు తీరుపై ఆయకట్టుదారులు పెదవి విరుస్తున్నారు.



జంపరకోట జలాశయం వ్యూ

ఇదీ పరిస్థితి..

పాలకొండ మండలం జంపరకోట గ్రామం వద్ద సహజసిద్ధంగా ఉన్న కొండల మధ్య రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని 1988లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ నిర్ణయించారు. మూడు వైపులా కొండలు ఉండడంతో అటవీ ప్రాంతం నుంచి వచ్చే సెలయేర్లు, కొండవాగులు, ఊటనీటిని ఒడిసిపట్టి రిజర్వాయర్ ద్వారా రైతులకు సాగునీరు అందించాలని సంకల్పించారు. కేవలం ఒక వైపు మాత్రమే గట్టును ఏర్పాటు చేయడం ద్వారా 2,100 బీడు భూములకు సాగునీరు అందించే అవకాశం ఉందని భావించి.. అప్పట్లో రూ.2.25 కోట్లు కేటాయించారు. అయితే 36 శాతం పనులను పూర్తయిన ఆ తర్వాత నిర్వాసితుల సమస్య, స్థల వివాదం తలెత్తడంతో జంపరకోట రిజర్వాయర్ పనులు ముందుకు సాగలేదు.

- 2004లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.15 కోట్లతో జంపరకోట జలాశయం పనులను ప్రారంభించారు. 9 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ఆ పనులు వివిధ రకాల అడ్డంకులు, సాంకేతిక సమస్యలతో ముందుకు సాగలేదు. ఆ సమయంలో జలయజ్ఞం కాస్త ధన యజ్ఞంగానే మారిందని చెప్పవచ్చు. అప్పట్లో ఎర్త్‌బండ్, స్పిల్‌వే, రెండు వైపులా స్లూయిజ్ నిర్మాణ పనులను చేపట్టినా.. అవి అర్థాంతరంగా నిలిచాయి. జంపరకోటలోని కాలువల నిర్మాణానికి భూసేకరణ, గిరిజనులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజ్ పరిహారం చెల్లించినా.. పనులు మాత్రం ముందుకు సాగలేదు.

చంద్రబాబు చొరవతో...

2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు జంపరకోట నిర్మాణ పనులకు చొరవ చూపారు. అప్పటికే రూ.15 కోట్ల వరకు ఉన్న ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.20 కోట్లకు పెంచారు. ఈ మేరకు 17.83 కోట్లు మంజూరు చేసి పనులను ప్రారంభించారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ రివర్స్ టెండరింగ్‌కు చేపట్టడంతో కథ మొదటికొచ్చింది.

పట్టించుకోని వైసీపీ

2021లో రూ.23 కోట్లతో అంచనాలు పెంచుతూ అధికారులు పంపిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రకటన రాకపోవడంతో జంపరకోట జలాశయం పనులు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే చందంగా మారింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో 17.83 కోట్లు కేటాయించి టెండర్లను పిలిచారు. అయితే ముఖ్యమంత్రి జగన్ .. 25 శాతం కంటే తక్కువ జరిగిన ఇరిగేషన్ పనులకు సంబంధించి టెండర్లను రద్దు చేశారు. అప్పటి నుంచి జంపర కోటకు నిధులు మంజూరు చేయకపోవడంతో రైతుల ఆశలు అడియాశలయ్యాయి. ప్రస్తుతం ప్రాజెక్టు అధ్వానంగా మారింది.

- కుడికాలువ 2.25 కిలోమీటర్లు మేర, ఎడమ కాలువ రెండు కిలోమీటర్లు మేర నిర్మాణం చేపట్టాల్సి ఉంది. గతంలో వేసిన ఎర్త్ పనులు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయాయి. అంతకుముందు కురిసిన భారీ వర్షాలకు ఒక పక్క ఎర్త్ పనులకు గండి పడింది. దీంతో చుక్కనీరు లేని పరిస్థితి ఏర్పడింది.

ప్రభుత్వ నిర్లక్ష్యం

జంపరకోట జలాశయం నిర్మాణంపై వైసీపీ ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నిధులు మంజూరు చేయకపోడంతో పనులు ముందుకు సాగలేదు. సాగునీరు అందకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

- బుడితి అప్పలనాయుడు, రైతు సంఘం నాయకుడు

కలగానే నిర్మాణం

జంపరకోట ప్రాజెక్టు పనులను పూర్తి చేస్తామని 2019 ఎన్నికల్లో జగన్ హామీ ఇచ్చి మరిచారు. నిధులు పూర్తిగా మంజూరు చేయక పోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణం కలగా మారింది.

-పి.సత్యనారాయణ, జంపరకోట

ప్రతిపాదనలు పంపించాం..

'జంపరకోట జలాశయం పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు పంపించాం. వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో నిర్మాణం చేపట్టలేకపోయాం. గతంలో టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 25 శాతం కంటే తక్కువ జరిగిన పనులను రద్దు చేసి నూతనంగా టెండర్లకు పిలిచింది. నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు ముందుకు సాగలేదు.' ఓ అధికారి తెలిపారు.

గజరాజుల హల్‌చల్

- భయాందోళనలో ప్రజలు

గరుగుబిల్లి/కొమరాడ, మే 16 : కొమరాడ మండలంలో కొద్దిరోజులుగా సంచరించిన గజరాజులు ఇప్పుడు గరుగుబిల్లి మండలానికి చేరాయి. బుధవారం రాత్రి అవి గిజబలో హల్‌చల్ చేశాయి. గురువారం ఉదయం ఆ గ్రామ ప్రధాన రహదారిపై అరగంటపాటు సంచరించాయి. దీంతో ఆ గ్రామస్థులు, ప్రయాణికులు హడలెత్తిపోయారు. ట్రాఫిక్ స్తంభించడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఈ లోపుగా ట్రాకర్స్ అక్కడకు చేరుకుని ఏనుగులను నాగావళి నదీతీరం వైపు మళ్లించారు. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఆ తర్వాత యథావిధిగా వాహన రాకపోకలు సాగాయి. ఇదిలా ఉండగా ప్రస్తుతం గిజబ, సింగనాపురం, బాసంగి, వెంకటాపురంతో పాటు పలు గ్రామాల్లో అరటి, మొక్కజొన్న సాగవుతుండగా, రబీ వరి ధాన్యం నూర్పులు, కోతల్లో రైతులు నిమగ్నమయ్యారు. అయితే గజరాజుల కారణంగా తమ పంటలు ధ్వంసమయ్యే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. తక్షణమే అటవీశాఖాధికారులు స్పందించి ఏనుగుల గుంపును ఈ ప్రాంతం నుంచి తరలించే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



గిజబ ప్రధాన రహదారిపై సంచరిస్తున్న ఏనుగులు

● సైన్స్ విద్యార్థుల కోసం ●

టెన్త్, ఇంటర్ తరవాత What Next

(నిన్నటి పేజీ తరువాయి)



ఫిషరీస్

సైన్స్, ఆర్ట్స్, బిజినెస్‌ను ఒక్కచోట చేరిస్తే అది ఫిషరీస్‌గా చెప్పవచ్చు. ప్రపంచంలో మత్స్య సంపదను ఎక్కువగా ఉత్పత్తి చేస్తున్న మూడో అతిపెద్ద దేశం భారత్. మన దేశానికి 7500 కిలోమీటర్ల విశాలమైన సముద్ర తీరం ఉంది. దీనితోపాటు దేశంలో కూడా అపారమైన నీటి వనరులు ఉన్నాయి. వీటన్నింటి కారణంగా ఈ రంగంలో అవకాశాలు విస్తారంగా కనిపిస్తాయి. ఫిషరీస్ రంగంలో ఉద్యోగాల విషయానికి వస్తే ఫామ్ మేనేజర్లు, హేచరీ మేనేజ్‌మెంట్, పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్ - ప్రాసెసింగ్, ఫిషరీ ఇన్‌స్పెక్టర్, ఫిషరీ వర్కర్ తదితరాలు ప్రధానంగా ఉంటాయి. ఫిషరీ రంగంలోని టెక్నికల్ ఫీల్డ్‌లోకి వెళ్లాలనుకునేవారు బైపీసీతో ఇంటర్ పూర్తిచేసి ఉండాలి. తెలుగు రాష్ట్రాల్లో ఏపీకి సంబంధించి ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ ఉంది. నెల్లూరు జిల్లా ముత్తుకూరులో ఉన్న ఫిషరీష్ కాలేజీకి ఎంతో చరిత్ర ఉంది.

తెలంగాణలోని పీవీనరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలో కూడా ఒక కాలేజీ ఉంది.

డెయిరీ టెక్నాలజీ

భారత దేశంలో ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న రంగాల్లో డెయిరీ ఒకటి. ప్రపంచ పశు సంపదలో భారత్ వాటా ఎక్కువే. మన దేశానికి విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించిపెడుతున్న రంగాల్లో డెయిరీ కూడా ఒకటి. అయితే ఈ రంగం ఇప్పటికీ సంప్రదాయ వ్యక్తుల చేతుల్లోనే ఉంది. చైనా, మెక్సికో లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా ఇందులో దూసుకుపోతుంటే మనం మాత్రం కొంత వెనకబడి ఉన్నామని చెప్పుకోక తప్పదు. మన దేశంలోని కొన్ని సంస్థలు డెయిరీ టెక్నాలజీలో కోర్సులను అందిస్తున్నాయి. చాలావాటిలో చేరడానికి ఇంటర్ పూర్తి చేసినవారు అర్హులు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఏపీ- తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ, తెలంగాణ - హైదరాబాద్ (రాజేంద్రనగర్)లోని పీవీ నరసింహారావు తెలంగాణ స్టేట్ వెటర్నరీ యూనివర్సిటీ డైరీ టెక్నాలజీలో కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి.

హెల్త్‌కేర్ ఇండస్ట్రీ



ఇంటర్ బైపీసీతో పూర్తి చేసినవారు ఎంబీబీఎస్ కోర్సులో చేరవచ్చు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు, కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు మెడిసిన్, డెంటల్ కోర్సుల్లో చేరాలంటే 'నీట్' ర్యాంకు తప్పనిసరి. నాలుగున్నర సంవత్సరాల ఎంబీబీఎస్ కోర్సు మూడు ఫేజులు, తొమ్మిది సెమిస్టర్లుగా ఉంటుంది. సాధారణంగా ఒక్కో సెమిస్టరుకు 120 వర్కింగ్ డేస్ గ్యాప్ ఉంటుంది. ఎంబీబీఎస్ పూర్తిచేసిన ప్రతీ విద్యార్థి 12 నెలల ఇంటర్న్‌షిప్‌నకు వెళ్లాల్సి ఉంటుంది. ప్రధానంగా ఈ కింది రకాల మెడిసిన్ శాఖలు ఉంటాయి.

- మెడిసిన్(అల్లోపతి) అండ్ డెంటిస్ట్రీ,
- హోమియోపతి
- ఆయుర్వేద
- యునాని
- నేచురోపతి

ఈ కోర్సులను అందించే సంస్థల వివరాలు వెబ్‌పేజీలో...

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/KN1r9lc లో చదవండి.

- ఆంధ్రజ్యోతి ఎడ్యుకేషన్ డెస్క్

(ఎంపిక చేసిన కొన్ని కాలేజీల లిస్టును మాత్రమే ఇక్కడ ప్రచురించాం. పూర్తి వివరాల కోసం గూగుల్ సెర్చ్ చేయగలరు.)

దిక్సూచి DIKSUCHI

ఫార్మసిస్టులు

టెన్త్, ఇంటర్ అర్హతలతో ఫార్మసీలో డిప్లొమా, డిగ్రీ, పీజీ కోర్సులు చేయవచ్చు. భారతదేశంలో ఫార్మసీ ఇండస్ట్రీ వంద సంవత్సరాల పురాతనమైనది. దేశవ్యాప్తంగా 25,000కు మించి మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లు ఉన్నాయి. వీటిలో ఐదోవంతు బల్క్ డ్రగ్ యూనిట్లే. ఎంపిసి లేదా బైపీసీతో ఇంటర్ పూర్తిచేసినవారు నాలుగు సంవత్సరాల బ్యాచిలర్ ఆఫ్ ఫార్మసీ(బిఫార్మసీ) కోర్సులో చేరడానికి అర్హులు. స్వయం ఉపాధి కోసం మెడికల్ షాపుల నిర్వహణ లేదా ఆస్పత్రుల్లో ఫార్మసిస్టుల ఉద్యోగాల అర్హతల కోసం రెండు సంవత్సరాల డిప్లొమా ఇన్ ఫార్మసీ కోర్సు చేయొచ్చు. బిఫార్మసీ చేసినవారు మాస్టర్స్ ఇన్ ఫార్మసీ కోర్సు చేయొచ్చు.

అగ్రికల్చర్, సంబంధిత రంగాలు

వ్యవసాయానికి సంబంధించిన డిగ్రీ కోర్సుల్లో చేరాలంటే కనీసం 50 శాతం మార్కులతో బైపీసీ పూర్తిచేయాలి. అగ్రికల్చర్ అలాగే సంబంధిత ఇతర కోర్సులను తెలుగు రాష్ట్రాల్లోని సంబంధిత యూనివర్సిటీలు అందిస్తున్నాయి.

- అగ్రికల్చర్, హార్టికల్చర్
- ఎన్విరాన్‌మెంట్ - పౌల్ట్రీ ఫార్మింగ్
- ఫారెస్ట్రీ అండ్ వైల్డ్ లైఫ్
- రూరల్ అండ్ మేనేజ్‌మెంట్
- వెటర్నరీ సైన్స్

ఫ్లోరీ కల్చర్

కమర్షియల్‌గా పూల సాగు చేయడమే ఫ్లోరికల్చర్. తెగులును తట్టుకునే లా, ఎక్కువ పూలు పూసేలా మొక్కలను తయారు చేయడమే ఫ్లోరికల్చరిస్టుల పని. హార్టికల్చర్‌లో భాగంగా ఉన్న ఇది తరవాతి కాలంలో ప్రత్యేక విభాగంగా మారింది. బీఎస్సీ హార్టీకల్చర్/అగ్రికల్చర్‌ను మన దేశంలో చాలా సంస్థలు అందిస్తున్నాయి. ఎంసెట్‌లో మెరిట్ ద్వారా మన రెండు రాష్ట్రాల్లో ఉమ్మడిగా ప్రవేశం పొందవచ్చు.

నవ్య | చిత్రజ్యోతి

థియేటర్ల బంద్ నిజం కాదు



రెండు తెలుగు రాష్ట్రాల్లో సింగిల్ స్ర్కీన్ థియేటర్లను మూసివేస్తున్నారంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని అపెక్స్ బాడీలు తెలుగు ఫిల్మ్ ఛాంబర్, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్, తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ గురువారం స్పష్టం చేశాయి. ఈ మేరకు ఆ సంస్థలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. థియేటర్లను మూసి వేస్తున్నట్లు ఒక సంఘం నిర్ణయం తీసుకుందంటూ వస్తున్న వార్తలను ఆ సంస్థలు ఖండించాయి. 'ఇప్పటివరకూ థియేటర్ల యజమానులు కానీ, వారికి సంబంధించిన సంఘాలు గానీ మాకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. ఇదంతా అబద్ధపు ప్రచారం మాత్రమే' అని స్పష్టం చేశాయి. 'కొన్నాళ్లుగా వసూళ్లు తక్కువ రావడం వల్ల కొంతమంది థియేటర్ల యజమానులు వ్యక్తిగతంగా నిర్ణయం తీసుకుని ఉండవచ్చు, అపెక్స్ బాడీలకు దీంతో సంబంధం లేదు' అని పేర్కొన్నాయి. సింగిల్ స్ర్కీన్ థియేటర్లను మూసివెయ్యాలనే నిర్ణయం తీసుకునే ముందు ఎగ్జిబిటర్లు తమను సంప్రదించలేదని ఫిల్మ్ ఛాంబర్ తెలిపింది.



కేన్స్‌కు ఐశ్వర్య కళ

ప్రతిష్ఠాత్మక 77వ కేన్స్ చలనచిత్రోత్సవాల్లో బాలీవుడ్ నటి, మాజీ ప్రపంచసుందరి ఐశ్వర్యారాయ్ బచ్చన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గురువారం ఆమె రెడ్‌కార్పెట్‌పై నడిచారు. బ్లాక్ అండ్ వైట్ దుస్తుల్లో చిరునవ్వులు చిందిస్తూ వేడుకకు ప్రత్యేక కళ తెచ్చారు. ఫ్రాన్స్‌లో జరుగుతోన్న ఈ వేడుకల్లో ఐశ్వర్యతో పాటు కియారా అద్వాణీ, శోభితా ధూళిపాళ, అదితీరావ్ హైదరీ పాల్గొన్నారు.

చేతికి కట్టుతో...



ఐశ్వర్యారాయ్ బచ్చన్ కేన్స్ చలనచిత్రోత్సవంలో మరోసారి మెరవబోతున్నారు. గురువారం కూతురు ఆరాధ్యతో కలసి ఈ వేడుకల్లో పాల్గొనేందుకు బయల్దేరివెళ్లారు. తల్లీ కూతుళ్లు ఇద్దరూ గురువారం ముంబై ఎయిర్‌పోర్ట్‌లో కనిపించారు. చేతికి గాయం అయినప్పుడు ధరించే కట్టుతో ఐశ్వర్య కనిపించారు. దీంతో రెడ్‌కార్పెట్‌పై ఆమె ప్రదర్శనపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/HPclzIT లో చదవండి.

పెద్ద హిట్ అవుతుంది

'ఈ సినిమాకు అరుణ్, నాగ బలం. నేను ఇంతవరకూ దర్శకుల్ని పరిచయం చేశాను. తొలిసారిగా నాగను నిర్మాతగా ఇంట్రడ్యూస్ చేస్తున్నాను. ట్రైలర్ చూస్తే టీమ్ పడిన కష్టం తెలుస్తుంది. ఇది న్యూ ఏజ్ లవ్ స్టోరీ అవుతుంది. ఈ నెల 25న వస్తున్న మా సినిమా పెద్ద హిట్ అవుతుందని ఆశిస్తున్నా' అన్నారు దిల్ రాజు. ఆశిష్, వైష్ణవి చైతన్య జంటగా నటించిన హారర్ థ్రిల్లర్ 'లవ్ మీ' ట్రైలర్‌ను గురువారం విడుదల చేసిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి ఈ సినిమాను నిర్మించారు.



దర్శకుడు అరుణ్ భీమవరపు మాట్లాడుతూ 'యుద్ధం చేయడం కంటే ప్రేమించడానికి గట్స్ కావాలి. మనిషి ప్రేమను పొందడమే కష్టం అనుకుంటే దెయ్యాన్ని ప్రేమించడం ఇంకెంత కష్టమో ఆలోచించండి. ఆశిష్ ఈ పాత్రను అద్భుతంగా పోషించాడు. గంగాదేవిలాంటి పాత్రను వైష్ణవి చేశారు. ఈ ప్రపంచాన్ని ప్రేమే నడిపిస్తోంది. 'వై' అనే క్వశ్చన్ లేకుండా 'వావ్' అనుకుని ఈ సినిమాను చూసి ఎంజాయ్ చేయండి' అన్నారు.

'ఇంత మంచి సినిమా చేసే అవకాశం కల్పించిన దర్శకనిర్మాతలకు కృతజ్ఞతలు. మా సినిమాతో మళ్లీ థియేటర్లు కళకళలాడతాయి' అన్నారు ఆశిష్. ఈ చిత్రంలో డిఫరెంట్‌గా, టఫ్‌గా ఉండే పాత్రను పోషించానని వైష్ణవి చైతన్య చెప్పారు.

గెడ్డలో ఇంటి నిర్మాణం


గెడ్డలో చేస్తున్న ఇంటి నిర్మాణం

● కాపుసోంపురంలో యథేచ్ఛగా పనులు
● ఫిర్యాదులు వెళ్లినా స్పందించని అధికారులు

శృంగవరపుకోట రూరల్: రైతుల పంటపొలాలకు నీరు అందిస్తున్న గెడ్డలను మూసేసి ఏకంగా గెడ్డమధ్యలో ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు ఓ ప్రబుద్ధుడు. దీనివల్ల ఈ గెడ్డద్వారా వందల ఎకరాలకు నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కాపుసోంపురం గ్రామం పైన ఉన్న కొండలను ఆనుకుని ముళ్లపూడి గెడ్డ ఉంది. ఈకొండల ద్వారా వచ్చేనీటితో వందల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు మిగతా నీరు మండలంలోని పెదఖండేపల్లి గంటావానిచెరువులో చేరగా దీనిని రైతులు వాడుకుంటారు. అయితే ఇలాంటి గెడ్డలో ఒక వ్యక్తి భారీ ఇంటి నిర్మాణం చేపట్టాడు. అది కూడా చుట్టూ పెద్దపెద్ద టార్పాలిన్‌లు కట్టి ఎవ్వరికీ కనిపించకుండా గెడ్డమధ్య భాగంలో ఇళ్లు కడుతున్నాడు. ఇదేంటని ప్రశ్నిస్తే తాను పేదవాడినని, తనకు ఎక్కడా ఇళ్లు లేకపోవడంతో ఇక్కడ కడుతున్నానని, నాయకులకు, పలుశాఖల అధికారులకు చెప్పి చేసుకుంటున్నానని తెలిపాడు. ఇది గెడ్డ కదా అంటే తనకన్నా ముందు ఎంతో మంది నిర్మాణాలు చేస్తే అవి ఎవరికీ కనిపించలేదా తాను కట్టుకుంటే ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారంటూ ఎదురు ప్రశ్నిస్తున్నాడు. అయితే ఈ నిర్మాణంపై కొంతమంది ఇటీవల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేయడంతో వారు తమ దిగువస్థాయి సిబ్బందిని పంపించి పలుమార్లు నిలిపివేయించినా సదరు వ్యక్తి అవేవీ పట్టించుకోకుండా తన పని కానివ్వడం విశేషం.

ఈ నిర్మాణం వల్ల గెడ్డనుంచి నీరు సక్రమంగా ప్రవహించక పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్‌శాఖ డీఈ రమణ వివరణ కోరగా వెంటనే తమ సిబ్బందిని పంపించి పనులు నిలుపుదల చేయిస్తామని, తాము ఎవ్వరికీ ఎటువంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. ఇదే విషయంపై పంచాయతీ వీఆర్‌వో కృష్ణ వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిన వెంటనే నిలుపుదల చేయించామన్నారు. సదరు వ్యక్తి వినకపోవడంతో డిప్యూటీ తహసీల్దార్ దృష్టిలో పెట్టామని నోటీసులు ఇచ్చి అక్రమ నిర్మాణం తొలగిస్తామని తెలిపారు.

అంబులెన్సూ.. ఆగాల్సిందే!

● రాజాంలో ఆటోలదే హవా..

రాజాం రూరల్, మే 16: అంబులెన్స్ వస్తే.. అత్యవసర సర్వీసుగా గుర్తించి సాధ్యమైనంత వరకూ ప్రతిఒక్కరూ అలెర్ట్ అవుతారు. వెంటనే తమ వాహనాన్ని పక్కకు మళ్లించి అంబులెన్స్‌కు దారి ఇస్తారు. కానీ రాజాంలో మాత్రం తరచూ అందుకు విరుద్ధమైన పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి. అంబులెన్స్ అయినా, అధికారి వాహనమైనా ఆటోలు ముందుకు సాగాకే వెళ్లాలి. ఆటోలు రోడ్డుపై ఎంతసేపు నిలిపివేస్తే అంతసేపూ వేచి ఉండాల్సిందే. రాజాం సామాజిక ఆసుపత్రి నుంచి మెయిన్‌రోడ్ మీదుగా వెళ్లేందుకు వచ్చిన అంబులెన్స్ ఆటోలు అడ్డంగా ఉండడంతో గురువారం సుమారు 20 నిమిషాల పాటు నిలిచిపోవాల్సి వచ్చింది. రాజాం మెయిన్‌రోడ్‌లో ఆటోల పుణ్యమాని నిత్యం ఇలాంటి పరిస్థితులు చోటు చేసుకుంటునే ఉన్నాయి. అయినా సరే పోలీసులు ఆటోల జోలికి వెళ్లకపోవడం... వాటిని నియంత్రించే చర్యలు తీసుకోకపోవడం కొసమెరుపు.


ముందుకు వెళ్లేందుకు వీల్లేక నిలిచిపోయిన 108 వాహనం

చర్యలు తప్పవు

లక్కవరపుకోట: ఎన్నికల కోడ్‌ను ఎవరు ఉ ల్లంఘించినా చర్యలు తప్పవని ఎస్‌ఐ ఆర్.గోపాలరావు తెలి పారు. ఎన్నికల సందర్భంగా హర్యానా నుంచి మండల కేంద్రానికి వచ్చిన ఆరు కంపెనీల కేంద్ర బలగాలు గురువా రం తిరిగి పయనమయ్యాయి. వీరందరినీ విశాఖ రైల్వే స్టే షన్‌కు ఎస్‌ఐ పంపించారు. గ్రామాల్లో ఎటువంటి అ వాంచనీయ ఘటనలు జరగకుండా గస్తీ నిర్వహించినట్టు తెలిపారు.

మార్గమధ్యలో గిరిజన మహిళ ప్రసవం


ఎస్.కోట రేగ పుణ్యగిరి నుంచి డోలీలో గిరిజన మహిళ ఆసుపత్రికు తరలింపు

శృంగవరపుకోట, మే 15: శృంగవరపుకోట పంచాయతీ శివారు రేగ పుణ్యగిరి గ్రామానికి చెందిన గిరిజన మహిళను డోలీలో ఆసుపత్రికి తీసుకొస్తుండగా మార్గ మధ్యలో ప్రసవించింది. ప్రస్తుతం స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తల్లిబిడ్డ క్షేమంగా వున్నారు. గురువారం గిరిజన మహిళ కుసాయి పురిటి నొప్పులతో బాధపడుతుంది. కొండపై నుంచి డోలీలో కిందకు దించుతున్నారు. పుణ్యగిరి ఆలయం సమీపంలోకి రావడంతో ప్రసవించింది. 108కు ఫోన్ చేసి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు డోలీపై తీసుకొచ్చారు. అక్కడ నుంచి 108 వాహనంలో ఆసుపత్రికి తీసుకొచ్చారు. గిరిజన గ్రామాలను ఐటీడీఏ పరిధిలో కలిపినప్పుడే ఈ డోలీ బాధ తప్పుతుందని సీపీఎం నాయకుడు మద్దిల రమణ పేర్కొన్నారు.

మద్యం మత్తులో యువకుల గొడవ

● ఒకరికి గాయాలు

శృంగవరపుకోట రూరల్, మే 16: వైన్స్ షాప్ వద్ద ఇద్దరు యువకులు మద్యం మత్తులో గొడవపడడంతో ఒకరు గాయపడ్డారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాత్రి ధర్మవరం ప్రభుత్వ వైన్స్ దుకాణానికి గ్రామానికి చెందిన గొర్లె మణికంఠ, దోసూరి ప్రదీప్, చింతాడ రవి వెళ్లారు. ఇదే సమయంలో వీరి మధ్య చిన్నపాటి వివాదం చెలరేగింది. ఈ సమయంలో మణికంఠ, ప్రదీప్ ఒకరిపై ఒకరు దాడిచేసుకున్నారు. ఈ క్రమంలో మణికంఠకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబసభ్యులు వెంటనే ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదుచేశారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. మణికంఠం తనను కులంపేరుతో దూషించాడని ప్రదీప్ సైతం ఫిర్యాదు చేసి చికిత్స కోసం ఆసుపత్రిలో చేరాడు. ఈ విషయంపై సీఐ మురళీ మాట్లాడుతూ ఇరువర్గాలు ఫిర్యాదు చేసుకున్నారని, అయితే చికిత్స నిమిత్తం వారు ఎస్.కోట ఆసుపత్రిలో చేరారన్నారు. గ్రామంలో ఎస్‌ఐ గంగరాజు విచారణ నిర్వహించారన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

దత్తిరాజేరు: మండలంలోని మర్రివలస గ్రామ సమీపంలో రైల్వేట్రాక్ వద్ద గుర్తు తెలియని మహిళ మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రైల్వే ఎస్‌ఐ రవివర్మ గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మర్రివలస రైల్వేట్రాక్ వద్ద సుమారు 35 సంవత్సరాలుగల మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి తమకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని చేరుకుని, పరిశీలించామన్నారు. అయితే మృతదేహం కల్లిపోయి ఉందని, సుమారు వారం రోజుల కిందట ప్రమాదం జరిగి ఉంటుందని, అయితే ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడిందా.. ఆత్మహత్య చేసుకుందా అని తెలియాల్సి ఉందన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తుల అరెస్ట్

విజయనగరం క్రైమ్: నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ హోటల్లో ఎఫ్‌సీఐ ఉద్యోగులమని.. డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ వెంకటరావు తెలిపారు. గరివిడికి చెందిన గొర్లి మహేశ్వరరావు, విశాఖ జిల్లా మధురవాడకు చెందిన అరసాడ కిర ణ్, పార్వతీపురం మన్యం జిల్లా నర్సిపురానికి చెందిన తర్లాడ దయానంద్, తెర్లాం మండలం కొరటాం గ్రామానికి చెందిన లావేటి కామేశ్వరరావు బృందంగా ఏర్పడి హోటల్‌కు వెళ్లి ఎఫ్‌సీఐ ఉద్యోగులమని పరిచయం చేసుకున్నారు. డబ్బులు ఇవ్వాలని. లేని పక్షంలో తనిఖీలు చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ హరిబాబునాయుడు హోటల్‌కు వెళ్లి విచారణ చేయగా డబ్బుల కోసం ఎఫ్‌సీఐ ఉద్యోగులుగా అబద్ధం చెప్పామని వెల్లడించారని సీఐ తెలిపారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి

విజయనగరం దాసన్నపేట: గజపతినగరం నియోజకవర్గంలో ఎన్నికల విధుల్లో ఉన్న పీఓపై దాడి చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి. రవీంద్రనాయుడు, డి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. పీఓ, ఏపీఓ, ఓపీఓలకు మూడు రోజుల రెమ్యూనరేషన్ చెల్లించాలని, ఈఎల్ఎస్ పొందేందుకు డ్యూటీ సర్టిఫికెట్‌ను ఎంఈవోల ద్వారా ఉపాధ్యాయులకు అందజేయాలన్నారు. 10 రోజు లకు పైగా ఎన్నికల విధులు నిర్వహించిన మాస్టర్ ట్రైనీలకు పారితోషికంతో పాటు, డ్యూటీ సర్టిఫికెట్లు అందజేయాలని కోరారు.

గొల్లపాలెంలో పోలీసు పికెట్


పికెటింగ్‌లో పోలీసులు

కొత్తవలస: శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ఉండడం కోసం మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో 24 గంటలూ పోలీసు పికెట్‌ను ఏర్పాటు చేశారు. మంగళవారం ఎన్నికలు పూర్తయిన తరువాత బుధవారం ఉదయం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త కడుపుట్ల గంగాధర్‌పై అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు మూకుమ్మడిగా దాడి చేయడంతో గంగాధర్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైసీపీకి చెందిన పలువురిపై పోలీసులు కేసునమోదు చేశారు. ఇది ఇలా ఉండగా తమలని తెలుగు దేశం పార్టీకి చెందిన కొంతమంది కార్యకర్తలు కొట్టారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గొల్లలపాలెం గ్రామంలో టీడీపీ, వైసీపీల మధ్య ఘర్షణలు జరిగే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటను జరగకుండా 24 గంటలూ పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. గ్రామంలో పరిస్థితులు చక్కబడేవరకు పోలీసు పికెట్‌ను కొన సాగిస్తామని సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

ప్రశాంత వాతావరణానికి సహకరించండి

వేపాడ: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ఏవిధమైన ఘర్షణలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో జీవించాలని, ఎన్నికలు ముగిసిన సవదర్భంగా ఫలితాలు రాకపోవడంతో గెలుపు ఓటములపై ఏవిధమైన గొడవలు, ఘర్షనలు పడకుండా ఉండాలని, ప్రశాంత వాతావరణానికి భంగం కల్పించిన చట్టపరమైన చర్యలు తీసుకోకతప్పదని వల్లంపూడి ఎస్‌ఐ కే.రాజేష్ హెచ్చరించారు. గురువారం మండలంలోని పాటూరు, బొద్దాం, ముకుందపురం, ఓబలయ్యపాలెంలో కోడ్ అమలులో ఉన్నందున ఏవిధమైన అల్లర్లు, ఘర్షణలకు దీరి తీసే విధంగా ప్రవర్తించరాదన్నారు. గ్రామస్థులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు.

వికసించిన మే పుష్పం..


ఆకట్టుకుంటున్న పుష్పం

రాజాం రూరల్, మే 16: మే పుష్పాలు వికసించాయి.. చూపరుల్ని ఆకట్టుకుంటున్నాయి. ఏడాదికోమారు మాత్రమే వికసించే ఈ తరహా పుష్పాలు పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో నివసిస్తున్న భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పండూరు వేణుగోపాల్ ఇంటి పూతోటలో ఒకేకొమ్మకు మూడు పూలు వికసించాయి. వీటిని ఫుట్‌బాల్ లిల్లీ అని, బ్లడ్ లిల్లి పుష్పాలు అని కూడా అంటారని వేణుగోపాల్ తెలిపారు.

జియోను సందర్శించిన విద్యార్థులు

శృంగవరపుకోట: శృంగవరపుకోట గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జీయో)ను గురువారం విశాఖలోని ఆదిత్య కళాశాల బీఎస్సీ డాటా సైన్స్ విద్యార్థులు సందర్శించారు. పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణకు పాటు పడుతున్న ఈ సంస్థలో క్షేత్ర స్థాయి పరిశీలన చేసారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు బి.రామకృష్ణ, డైరెక్టర్ వై.విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

512 మందికి బీసీజీ టీకాలు

లక్కవరపుకోట: మండలంలోని 21 సచివాలయాల పరిధిలో గురువారం బీసీజీ టీకాల కార్యక్రమం మొదలుపెట్టారు. ఎల్.కోట పీహెచ్‌సీ వైద్యులు బి.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మొదటి రోజు 512 మందికి టీకాలు వేసినట్లు తెలిపారు. వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని రాష్ట్ర, జిల్లా పర్యవేక్షణ అధికారులు పరిశీలించారు.

ప్రశాంతంగా ఏపీఈఏపీ సెట్

రాజాం రూరల్: గురువారం ప్రారంభమైన ఏపీ ఈఏపీ ప్రవేశపరీక్షలు రాజాంలో ప్రశాంతంగా జరిగాయి. ఇక్కడి జి.ఎం.ఆర్.ఐ..టీ.లో రెండు విభాగాలలో పరీ క్షలు నిర్వహించారు. ఉదయం జరిగిన పరీక్షలకు 304 మంది విద్యార్థులకు గాను 284 మంది హాజరయ్యా రు. రెండోపూట పరీక్షలకు 300 మంది విద్యార్థులకు గాను 280 మంది హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డా.ప్రసాద్ తెలిపారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

బాడంగి: స్థానిక గ్రంథాలయంలో ఈ నెల 15 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు వేసవి శిక్షణా శిబిరాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా స్పోకేన్ ఇంగ్లీష్, కంప్యూటర్ బేసిక్స్‌తోపాటు నీతి కథలు చదివించడం జరుగుతుంది

ముత్యాలమ్మ పండగ

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామ ప్రజలు గురువారం గ్రామ దేవత ముత్యాలమ్మ పండగను వైభవంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయడంతో పాటు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి పండగను పురస్కరించుకుని ఘటాల ను ఊరేగించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భారీ స్థాయిలో అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించ గా గ్రామస్థులు అధిక సంఖ్యలో హాజరై అన్న ప్రసా దాలను స్వీకరించారు.

భవన నిర్మాణాలు వేగవంతం చేయాలి

గుమ్మలక్ష్మీపురం: మండలంలో చేపడుతున్న నాడు-నేడు భవన నిర్మాణ పనులను వేగవంతం చేయా లని ఎంఈవో-1 చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయ న స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మండలంలో నాడు-నేడు నిధులతో నిర్మాణాలను వేగవంతం చేయా లని పాఠశాల ఉపాధ్యాయులను ఆదేశించారు. రాష్ట్ర విద్యాశాఖాధికారుల ఆదేశాల మేరకు నాడు-నేడు భవ నాల నిర్మాణ పనులు, మరమ్మతులు సకాలంలో సక్ర మంగా ఉండేలా హెచ్‌ఎంలు పరిశీలించాలని సూచించా రు. జూన్ 12న పాఠశాలలు తెరిచేలోపు సాధ్యమైనంత వరకు ఆయా భవనాలను అందించాలన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పాచిపెంట: గురువునాయుడుపేటకు చెందిన ఐ.అప్పలరాజు మక్కువ మండలంలో వెలుగు సీసీగా పనిచేశారు. ఈయన ఈనెల 14న అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో ఆ సంస్థ సిబ్బంది పార్వతీపురం డీఆర్‌డీఏ వై.సత్యంనాయుడు ఆదేశాల మేరకు గురువారం గురువునాయుడుపేట వెళ్లి, మృతుడి భార్య రాజేశ్వరికి రూ.25 వేలు అందజేశారు. అలాగే మన్యం జిల్లా వెలుగు సిబ్బంది సొంతంగా రూ.74,100 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎంలు అప్పారావు, ప్రవీణ్, ఏపీఎంలు సన్నిబాబు, నీలంనాయుడు, జయకుమార్, వెంకట్ పాల్గొన్నారు.

ఏడాది శిక్షణలో ఎంతో నేర్చుకున్నా..

● ట్రైనీ సహాయ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

కలెక్టరేట్: విజయనగరం జిల్లాలో గత ఏడాది కాలంలో వివిధ హోదాల్లో పొందిన శిక్షణ ద్వారా ఎన్నో పరిపాలనపరమైన అంశాలను నేర్చుకున్నానని, ఈ అనుభవంతో రానున్న రోజుల్లో ప్రజలకు మంచి సేవలు అందించే ప్రయత్నం చేస్తానని జిల్లాలో శిక్షణ పూర్తి చేసుకున్న ట్రైనీ సహాయ కలెక్టర్ బి.సహాదిత్ వెంకట్ త్రివినాగ్ అన్నారు. గురువారం విలేఖర్లతో ఆయన మాట్లాడారు. జిల్లాలో పని చేసిన కాలంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణతో పాటు పాటు రైతు ప్రమాద దుర్ఘటన, ఇతర విపత్తుల సమయంలో ఏ విధంగా వ్యవహరించాలనే అంశాలపై అవగాహన ఏర్పడినట్టు తెలిపారు. జిల్లాలోని గత ఏడాది మే 25న శిక్షణ కోసం చేరానని, బుధవారంతో శిక్షణ పూర్తియిందన్నారు. జిల్లాలోని చీపురుపల్లి ఆర్‌డీవోగా, మెంటాడ తహసీల్దార్‌గా శిక్షణ పొందానని, వివిధ హోదాల్లో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఏయే విధులు నిర్వహిస్తారు, ప్రోటోకాల్ నిర్వహణ అంశాలను కూడా తెలుసుకున్నానన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటర్లను చైతన్య పరిచేందుకు చేపట్టిన స్వీప్ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యానని, ఈ కార్యక్రమాల ద్వారా జిల్లాలోని ప్రస్తుత ఎన్నికల్లో రెండు శాతం మేరకు ఓటింగ్ పెంచగలిగామన్నారు. జిల్లాలో శిక్షణ పొందిన కాలంలో కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్లు మయూర్ అశోక్; కార్తీక్ తనకు ఎంతగానో సహకరించి ప్రోత్సహించారని తెలిపారు.


మాట్లాడుతున్న త్రివినాగ్

తిరుమల సందర్శనలో కోళ్ల కుటుంబం


దర్శనం అనంతరం విలేకర్లతో మాట్లాడుతున్న కోళ్ల

శృంగవరపుకోట: శృంగవరపుకోట శాసన సభ టీడీపీ అభ్యర్థి కోళ్ల లలిత కుమారి భర్త బుచ్చి అప్పల రామప్రసాద్, కుటుంబ సభ్యులతో కలసి గురు వారం తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో రెండు నెలల పాటు ఎన్నికల ప్రచారంతో బిజీగా గడిపిన ఈ కుటుంబం తిరుపతి వెళ్లింది. తెలుగు దేశం పార్టీ, జనసేన, బీజేపీ కూటమికి 130 సీట్లు పైబడి వస్తాయని, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సీఎంగా అధికారం చేపట్టాలని మొక్కుకున్నట్లు ఆంధ్రజ్యోతికి ఫోన్‌లో తెలిపారు. తనకు టిక్కెట్ కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీవారి దయతో ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిస్తానని పేర్కొన్నారు.

హరిజన వీధిలో నీటి కష్టాలు


పైపులైన్లకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

రాజాం: పురపాలక సంఘం పరిధిలో తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల కిందట పైపులైన్‌లు పాడవ్వడంతో ఈ ఇబ్బందులు తప్పడం లేదు. విషయం తెలుసుకున్న అధికారులు రంగంలోకి దిగి పైపులైన్లకు మరమ్మతులు చేపట్టేందుకు గురువారం చర్యలు తీసుకున్నారు. పాత పైప్‌లైన్‌లు తొలగించి జింక్ ఆక్సిజన్ పైపులను ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. పురపాలక సంఘం పరిధిలోని అన్ని ప్రాంతాలకు తాగునీరు అందించిన అధికారులు ఈ ప్రాంతానికి తాగునీరు అందించడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకున్నారు. దీంతో హరిజన వీధికి తాగునీటి ఇబ్బందులు శుక్రవారం నుంచి ఉండవని పురపాలక సంఘం ఏఈ పొన్నాడ రామరాజు తెలిపారు. పైపులైన్ పాడైనప్పటికీ ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్యాంకు ద్వారా తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు.

ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల ప్రచారం

పాలకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల(బాలురు) అధ్యాపకులు మండలంలోని తలవరం, బెజ్జి, పారాపురం, నీలానగరం, తెట్టంగి తదితర గ్రామాల్లో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పదో తరగతి పాసైన విద్యార్థులకు స్థానిక జూనియర్ కళాశాలలో అందిస్తున్న కోర్సుల వివరాలు, కళాశాల వసతుల వివరాలు, విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీల వివరాలపై విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. నాడు-నేడు ద్వారా అందంగా రూపుదిద్దుకున్న కళాశాల, ల్యాబరేటరీలు, డిజిటల్ విద్యాబోధన, ఎంసెట్, నీట్ తదితర పోటీ పరీ క్షలకు శిక్షణ ఇస్తామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ హరగోపాల్ పర్యవేక్షణలో సిబ్బంది గోవిందరావు, వెలమల అప్పారావు, వెంకటేశ్వర్, శివానంద్, ఎం.శ్రీనివాసరావు, వీజీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ● **బాడంగి:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి గానూ ఈ నెల 15 నుంచి 31 వరకు ఫేజ్-1 అడ్మిషన్లు జరుగుతున్నాయి. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో ఇంగ్లీషు, తెలుగు మీడియంలో సీట్లు ఉన్నట్టు అధ్యాపకులు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. ● **రేగిడి:** మండలంలో ఏపీపురం హైస్కూల్ ఉంది. ఈపాఠశాలల్లో ఇంటర్ అడ్మిషన్లు శతశాతం ఉండేలా ముమ్మర చర్యలు చేపట్టినట్లు బొబ్బిలి డివిజన్ డిప్యూటీ డీఈవో మోహనరావు వెల్లడించారు. ఈ అడ్మిషన్ల ప్రక్రియపై గురువారం ఏపీపురం క్యాచ్‌మెంట్ హైస్కూల్ హెచ్‌ఎంలు, స్థానిక ఎంఈవోలు వరప్రసాదరావు, బి ఏరకయ్యలతో డిప్యూటీ డీఈవో సమీక్షా సమావేశం నిర్వహించారు.

కాలువలనూ వదలరు

శృంగవరపుకోట రూరల్: మండలంలోని రియల్టర్లు రెచ్చిపోతున్నారు. డీపట్టా భూముల స్వరూపాలు మార్చేస్తున్నారు. అందులో ఉన్న చెరువులను కప్పేస్తున్నారు. ఇక పంట కాలువల్లో మట్టి పోసి తమ పొలాలకు రోడ్లు వేసుకుంటున్నారు. ముషిడిపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 17లోని 2లో సుమారు 2.15 ఎకరాల డీపట్టా భూమి ఉంది. గతంలో దీనిని చేపల చెరువులుగా చేశారు. ప్రస్తుతం భూముల ధరలు ఆకాశాన్ని అంటడంతో వీటి స్వరూపాలు మార్చి అ మ్మకాలకు సిద్ధమవుతున్నారు. గతంలో ఈ ప్రాంతంలో ఎకరా రూ.వందల నుంచి రూ.వేలల్లోపు ఇచ్చి ఈ భూములను పెత్తందారులు కాజేశారు. కొద్దినెలల క్రితం డీపట్టా భూములపై ప్రభుత్వం హక్కు కల్పించడంతో వీటిని చదును చేసే కార్యక్రమం మొదలుపెట్టారు. ఈ విషయం రెవెన్యూ అధికారులకు తెలియడంతో వచ్చి చూసి వెళ్లారు. కొత్తూరు గ్రామంలో సచివాలయానికి ఆనుకొని రైతుల పొలాలకు సాగునీరు వెళ్లే కాలువ ఉంది. దీనిని ఆనుకొని


కొత్తూరు సచివాలయం వద్ద రైతుకాలువల్లో పొలాల దారిలో మట్టిపోసిన దృశ్యం


ముషిడిపల్లి పంచాయతీ బందవలసను అనుకుని ఉన్న డీపట్టా భూమిలో ఆక్రమణలు ఇలా

ప్రస్తుతం భూముల రేట్లు బాగా పలుకుతున్నాయి. కొందరు ఈ కాలువల్లో మట్టిపోసి పొలాలకు దారులుగా మారుస్తున్నారు. ఇదంతా నిత్యం సచివాలయ సిబ్బంది చూస్తున్నారు. కానీ నోరు మెదపకపోవడం విశేషం. ఇప్పటికే కిల్తంపాలెం పంచాయతీలో 19 చెరువులు మాయమయ్యాయి. శ్మశానాలు సైతం కబ్జాలకు గురయ్యాయి. కొంతమంది రిసార్టుల పేరుతో డీపట్టా భూముల్లో భవనాలు నిర్మించారు. వీటిని ఏడాది క్రితం రెవెన్యూ అధికారులు పరిశీలించి.. నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారనే విమర్శలు ఉన్నాయి. పేదోడు సెంటు భూమి ఆక్రమించుకుంటే వాటిని తొలగించడానికి ఉత్సాహం చూపించే రెవెన్యూ శాఖ పెద్దోళ్ల విషయంలో ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

'పది' తర్వాత అవకాశాలెన్నో..

● ఆలోచించి నిర్ణయం తీసుకోవాలంటున్న నిపుణులు ● వృత్తి విద్యా కోర్సులపై ఆసక్తి చూపుతున్న విద్యార్థులు



(కలెక్టరేట్)

విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి పదో తరగతి తొలిమెట్టు. పదిలో సాధించిన మార్కులే వారి భావిజీవితాన్ని తీర్చిదిద్దుతాయి. పదో తరగతి తర్వాత చాలా మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఏ కళాశాలలో చేరాలి? ఏ కోర్సుల్లో చేరాలి? ఇంకా ఏం చేయవచ్చు? ఇలా పరిపరి విధాలా ఆలోచిస్తుంటారు. కొందరికి పది పరీక్షల తర్వాత కోర్సులు అవకాశాలు వివరాలు తెలియక ఆసక్తి, అభిలాష ఉన్నవారు కూడా చదవాలనుకునే కోర్సులకు దూరమవుతుంటారు. ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, సంప్రదాయ కోర్సులతో పాటు పలు వృత్తి విద్యాకోర్సులు, సాంకేతిక కోర్సులు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలోనూ ఇటీవల ఉపాధి కోర్సులు, వృత్తి విద్యా కోర్సులపై ఆసక్తి పెరుగుతోంది. ఈ ఏడాది జిల్లాలో మొత్తం 21,752 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరంతా బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకునేందుకు ఎదురుచూస్తున్నారు.

● **వృత్తి విద్యా కోర్సులు..**

ఉపాధి విద్య, ఉపాధితో కూడిన విద్య వీటిలో దేనిని ఎంపిక చేసుకున్నా మేలైన ఫలితాలు కనబడతాయి. దీనిలో వ్యవసాయం, వెటర్నరీ, రేడియో అండ్ టీవీ మెకానిజం, బిజినెస్ మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్ టెక్నాలజీ, కార్యుల నిర్వహణ, పారా మెడికల్ కోర్సులు, ఏఎన్ఎం, ల్యాబ్ టెక్నీషియన్, డెయిరీ, కేటరింగ్, ఆప్తాలమిక్ అసిస్టెంట్లు తదితర కోర్సులు ఇందులో ఉన్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే కాకుండా కొన్ని గుర్తింపు పొందిన ప్రైవేటు కళాశాలల్లో కూడా ఈ కోర్సులు అందుబాటులో ఉంటున్నాయి. ● పదో తరగతి పూర్తయిన తర్వాత ఉన్నత చదువులు చదువుకోవడానికి ఆర్థిక స్థోమత లేనివారు, స్వయం ఉపాధి ద్వారా ఉపాధి పొందాలనుకునేవారికి ఐటీఐ మంచి అవకాశం. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలు 12 వరకూ ఉన్నాయి. ఎన్నో రకాల కోర్సులున్న వీటిల్లో చదువుకున్న వారందరూ ప్రభుత్వ ప్రైవేటు సంస్థల్లో పరిశ్రమల్లో గతంలో ఎన్నో ఉద్యోగాలు పొందారు. ● జిల్లాలో వ్యవసాయం ప్రధానం.. గ్రామీణ ప్రాంత విద్యార్థులు వ్యవసాయ కోర్సులు చేయాలనే ఆసక్తి ఇటీవల ఎక్కువైంది. ఇలాంటి వారికోసం ప్రభుత్వం వ్యవసాయ కోర్సులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధ కళాశాలల్లో ఈ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. డిప్లొమో ఇన్ అగ్రికల్చర్, వెటర్నరీ, హార్టికల్చర్ తదితర కోర్సులున్నాయి.

● **ఇంటర్మీడియట్..**

పదో తరగతి తర్వాత సాధారణంగా అందరూ ఎక్కువగా చేరేది ఇంటర్‌లోనే. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఇంటర్ విద్య అందుబాటులో ఉంది. అన్ని మండల కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాల లున్నాయి. ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీల్లో కూడా ఇంటర్ విద్య అందుబాటులో ఉంది. నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా గ్రూపులు ఎంపిక చేసుకోవాలి. సబ్జెక్టు మీద పట్టు ఉందో లేదో ముందుగా పూర్తి అవ గాహనకు వచ్చి ఆయా కోర్సుల్లో చేరడంతో పాటు భవిష్యత్తులో ఉద్యోగా లు, ఉపాధి అవకాశాలు కూడా తెలుసుకోవాలి. ● సాంకేతిక విద్యలో చేరాలనుకునేవారికి పాలిటెక్నిక్ అనువైనది. ప్రభుత్వం నిర్వహించే పాలీ సెట్ పరీక్ష రాసి అందులో ర్యాంకు సంపాదించుకోవాలి. జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలలు ఐదు వరకూ ఉన్నాయి. ఇందులో ఈఈఈ, ఈసీఈ, సీఎస్‌సీ, ఆటోమొబైల్, మెకానికల్, కెమికల్ తదితర సుమారు 30 బ్రాంచ్‌లు అందుబాటులో ఉన్నాయి. కోర్సు పూర్తిచే సుకుంటే జూనియర్ ఇంజనీర్లుగా ఉద్యోగావకాశాలు కూడా ఉన్నాయి. ఉన్నత విద్యను అభ్యసించాలంటే ఈసెట్ రాసి నేరుగా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో చేరవచ్చు. ● రాష్ట్రంలో పది రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఏపీఆర్జేసీ ప్రవేశాలకు పరీక్షలు నిర్వహిస్తారు. పదో తరగతి పూర్తిచేసిన వారు దీనికి అర్హులు. ప్రభుత్వమే ఉచితంగా విద్యనందిస్తోంది.

ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సులే మంచిది



పదో తరగతి పూర్తి అయిన తరువాత భవిష్యత్ కోసం మంచి నిర్ణయం తీసుకోవాలి. ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సుల్లో చేరితే చాలా మంచిది. ఉద్యోగ అవకాశాలు ఉన్న కోర్సులు, సాంకేతిక విద్య వంటి కోర్సుల్లో చేరితే మంచి భవిష్యత్తు ఉంటుంది. అలాగే వివిధ కోర్సుల్లో చేరడానికి సంబంధించి ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసింది. పరీక్షలు రాసిన తరువాత విద్యార్థులు ఖాళీగా ఉండకుండా వివిధ ప్రవేశ పరీక్షలకు చదవాలి. ఇప్పుడు నుంచి కష్టపడితే రానున్న రోజుల్లో మంచి ఫలితాలు వస్తాయి.

-ప్రేమకుమార్ (డీఈవో)

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి తెలిపారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. లైన్ మెయింటెన్స్ పనులు నిమిత్తం 11కేవీ టౌన్-1 ఫీడర్, 11కేవీ సీతంపేట ఫీడర్ మీద ఉదయం 8 గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. పట్టణంలోని ఎంఎంనగర్, శ్రీనివాసనగర్, ఎస్.కె.రాజపురం, సీఎల్.నాయుడు, కోమటిపేట, దేవరపేట, వెంకంపేట, పెదకాపు వీధి, చినకాపు వీధి, శ్రీకాకుళం రోడ్డు, సీతంపేట రోడ్డు, వెలగవాడ, ఓని, విజయరాంపురం, పరశురాంపురం, సిరికొండ, గదబవలస తదితర ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు. ● **భామిని:** భామిని మండలంలో 33 కేవీ ఫీడర్ మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ మరమ్మతులు చేయడంతో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కూటమి శ్రేణుల కృషితో పెరిగిన ఓటింగ్


మాట్లాడుతున్న శ్రీనివాస్

గజపతినగరం: ఎన్డీఏ కూటమి శ్రేణుల కృషితో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కంటే గజపతినగం నియోజకవర్గంలో ఓటింగ్ శాతం అధికంగా పెరిగిందని ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం లో ఆయన మాట్లాడారు. పార్టీ గెలుపొం దేందుకు టీడీపీతో పాటు బీజేపీ, జనసేన పార్టీ నాయకుల, కార్యకర్తలు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించారని, ప్రతిఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పీవీవీ గోపాలరాజు, టీడీపీ గంట్యాడ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కరనాయుడు, మాజీ జడ్పీటీసీ మక్కువ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

విజయానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు

పార్వతీపురంటౌన్: ఎన్డీయే కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసిన వారందరికీ పార్వతీపురం మన్యం జిల్లా బీజేపీ తరపున ఆ పార్టీ అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. బీజేపీ పైనే కాకుండా ఇటీవల పార్టీ జిల్లా అధ్యక్షుడునైనా తనపై కూడా వ్యక్తిగత దూషణలు చేయడం కార్యకర్తలు, నాయకులకు పరిపాటిగా మారడం దురదృష్టకరమన్నారు. విమర్శలు గుప్పించడం సరికాదంటూ రాష్ట్ర అధిష్ఠానానికి ఫిర్యాదు చేశానని చెప్పారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఉమామహేశ్వరరావును జిల్లా అధ్యక్షుడిగా సస్పెండ్ చేస్తున్నట్టు తెలిపారు. ఇకపై పార్టీ ఆదేశాల మేరకు తనతో పాటు నాయకులు, కార్యకర్తలు పని చేయాల్సిన అవసరం ఉందన్నారు.

రంగారావును కలిసిన టీడీపీ నాయకులు


సుజయ్‌కృష్ణ రంగారావును కలిసిన టీడీపీ నాయకులు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పార్టీ జోనల్-2 కోఆర్డినేటర్, మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావును పార్టీ పట్టణ నాయకులు గురువారం కలిశారు. ఈసందర్భంగా పార్వతీపురం నియోజకవర్గంలో పార్వతీపురం పట్టణంలో జరిగిన పోలింగ్ వివరాలపై మాజీ మంత్రికి వివరించారు. ఈ కార్య క్రమంలో టీడీపీ నాయకులు ఎం.కృష్ణమోహన్, డాక్టర్ భద్రీనాథ్, మజ్జి వెంకటేష్, కోరాడ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి

గుమ్మలక్ష్మీపురం: ఈ ఏడాది జనవరి నెల నుంచి సీఎం జగన్ బటన్ నొక్కిన నిధులు వెంటనే విడుదల చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఎన్నికకు ఒక్కరోజు ముందు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, ఎన్నిక జరిగిన తర్వాత రోజున ఈ నిధులు విడుదల చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిందని చెప్పారు. ఎన్నికలు జరిగి మూడు రోజులు గడిచినా నేటికీ ఈ నిధులు విడుదల చేయలేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. రైతు రాయితీ, విద్యాదీవెన, బీసీ నేస్తం, ఆసరా తదితర పథకాల నిధులు వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని కోరుతున్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో వారివారి ఖాతాలో ఈ నిధులు పడక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ● **పార్వతీపురంటౌన్:** ఎన్నికల వల్ల నిలిపేసిన పథకాల ద్వారా లబ్ధిదారులకు రావాల్సిన డబ్బులను వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని సీపీఎం పట్టణ నాయకులు జీవీ రమణ, పాకల సన్యాసిరావు గురువారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఫిబ్రవరి, మార్చి నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం రైతుల పెట్టుబడి రాయితీ, విద్యాదీవెన, ఆసరా వంటి పథకాలకు బటన్ నొక్కిందని, అయితే ఇప్పటివరకు లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాకపోవడం విచారకరం అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు లబ్ధిదారుల ఖాతాల్లో వారి మొత్తాన్ని జమ చేయాలని డిమాండ్ చేశారు.

గ్రామాల్లో సంయమనం పాటించాలి


గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న సీఐ రవికుమార్

సీతానగరం: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని, జూన్ 4న కౌంటింగ్ వరకు గ్రామాల్లోని ప్రజలు సంయమనం పాటించాలని పార్వతీపురం రూరల్ సీఐ కె.రవికుమార్ కోరారు. మండలంలోని సీతానగరం, పెదభోగిల, బుడ్డిపేట, లక్ష్మీపురం, బూర్జ తదితర గ్రామాల్లో ఆయనతో పాటు ఎస్ఐ రాజేష్ గురువారం పర్యటించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలతో మాట్లాడారు. ఎస్పీ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ఫలితాలపై పందేలు కాసినట్టు సమాచారం తెలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.

సాలూరులో తగ్గిన పోలింగ్

సాలూరు రూరల్: సాలూరు నియోజకవర్గంలో ఈ ఎన్నికల్లో 2019 ఎన్నికల కంటే పోలింగ్ శాతం తగ్గింది. పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురం, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లో 2019 ఎన్నికల కంటే పోలింగ్ శాతం పెరిగింది. సాలూరులో మాత్రం ఇందుకు భిన్నంగా పోలింగ్ శాతం తగ్గింది. పోలింగ్ శాతం తగ్గడంపై టీడీపీ, వైసీపీ తర్జనభర్జన పడుతున్నాయి. పోలింగ్ తగ్గడం ఏ పార్టీకి అనుకూలమోనని రాజకీయ పరిశీలకులు ఆలోచిస్తున్నాయి. ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో సాలూరు నియోజకవర్గంలో మొత్తం 2,04,489 ఓటర్లకుగాను 1,56,331 ఓట్లు పోలయ్యాయి. 99,770 మంది పురుషులకుగాను 76,403 మంది, 1,04,715 మంది మహిళలకుగాను 79,928 మంది ఓటును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో సాలూరు మున్సిపాలిటీలో 41,709 మందికి 28,693 మంది, సాలూరు మండలంలో 44,727 మంది ఓటర్లుకు గాను 35,132 మంది, మక్కువ మండలంలో 42,257 మందికి 32,238 మంది, పాచిపెంట మండలంలో 37,116 మందికిగాను 29,017 మంది, మెంటాడ మండలంలో 38,680 మంది ఓటర్లుకుగాను 31,251 మంది ఓటును వినియోగించుకున్నారు. మొత్తంగా 76.45 శాతంగా పోలింగ్ ఉంది. గత 2019 ఎన్నికల్లో సాలూరు నియోజకవర్గంలో 79.74 శాతంగా ఉంది. గత ఎన్నికల్లో సాలూరు నియోజకవర్గంలో 1,90,619 మంది ఓటర్లకు గాను 1,52,004 మంది ఓటు వేశారు. ఇందులో వైసీపీకి 78,430 ఓట్లు, టీడీపీకి 58,401 ఓట్లు వచ్చాయి. గత ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో 3.29 శాతం పోలింగ్ తగ్గింది. ఈ ఎన్నికల్లో 48,158 మంది వివిధ కారణాల వల్ల ఓటు వేయలేదు. పోలింగ్ శాతం తగ్గడంపై పార్టీలు తమకు లాభమని అంచనాలు వేస్తున్నాయి. అదే పార్వతీపురంలో గత ఎన్నికల్లో 76.90 శాతం కాగా ఈసారి 78.23 శాతం, కురుపాంలో గత సారి 77.80 శాతం కాగా ఈసారి 78.54 శాతం, పాలకొండలో గత సారి 73.91 శాతం కాగా ఈసారి ఎన్నికల్లో 75.26 శాతం పోలింగ్ నమోదయ్యింది. మిగిలిన మూడు నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం అధికంగా కాగా సాలూరులో తగ్గింది.


బొండపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


గరివిడిలో..


భామిని: పసుకుడి గ్రామంలో

పరిసరాల శుభ్రత పాటించండి

● జిల్లా వ్యాప్తంగా జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం

● గ్రామాల్లో పీహెచ్‌సీల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు ● పాల్గొన్నవైద్యాధికారులు, సిబ్బంది,

బొండపల్లి: ప్రాణాంతక డెంగ్యూ వ్యాధిపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బొండపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎల్.సత్యనారాయణ, ఎస్.సమీరా సూచించారు. డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం బొండపల్లితో పాటు గొట్లాం గ్రామాల్లో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రాజగోపాల్, వైద్య సిబ్బంది ఎస్ఏ.బాషా, బి.విశ్వేశ్వరరావు, వసంతలక్ష్మి, సీహెచ్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ● **గరివిడి:** జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా గురువారం తాటిగూడ గ్రామంలో గరివిడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎస్.దీప్తి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దోమల వల్ల వచ్చే వ్యాధులు, వాటి నివారణ, చికిత్సపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. దోమల నివారణతో డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, చికెన్‌గున్యా లాంటి వ్యాధులను దూరం చేయవచ్చని చెప్పారు. ● **భామిని:** డెంగ్యూ వ్యాధి సోకకుండా ముందుగానే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భామిని పీహెచ్‌సీ వైద్యాధికారిణి సంతోషలక్ష్మి, వైద్యుడు సాయి కోరారు. జాతీయ డెంగ్యూ నివారణా దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని ప్రతి సచివాలయం పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ జ్వరాలకు దోమలే కారణమని, పరిసర ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. ఈమేరకు పసుకుడి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిం చారు. 42 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది మధు, భాస్కరరావు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. ● **కురుపాం:** జాతీయ డెంగ్యూ దినోత్సవంలో భాగంగా కురుపాం వారపు సంతలో రావాడ రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రజలను అవగాహన పరుస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భగా వైద్యుడు చీకటి శంకరరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే లార్వా అభివృద్ధి చెంది, దోమలు పెరిగి దోమ కుట్టడంతో డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు. ● **రేగిడి:** డెంగ్యూ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అశిరినాయుడు అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా గురువారం రేగిడి గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అయన పాల్గొని, డెంగ్యూ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సీహెచ్‌వో సుందరేశ్వరరావు, సుపర్‌వైజర్ అప్పారావు, నాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు. ● **కొత్తవలస:** మండలంలోని వియ్యంపేట, కొత్తవలస పీహెచ్‌సీల ఆధ్వర్యంలో డెంగ్యూ నివారణా దినోత్సవాన్ని నిర్వహించారు. కొత్తవలస, వియ్యంపేట పీహెచ్‌సీల వైద్యాధికారులు సీతల్ వర్మ, సింహాద్రినాయుడు నేతృత్వంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ● **వేపాడ:** దోమల నివారణతో డెంగ్యూను అరికట్టవచ్చునని వేపాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి ధరణి అన్నారు. వల్లంపూడి సచివాలయ కార్యాలయం వద్ద గురువారం డెంగ్యూపై అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించారు. బొద్దాం పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు.


వేపాడ: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


ఎస్.కోట: కొట్టాం పీహెచ్‌సీ పరిధిలో..


రేగిడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..


కొత్తవలసలో..

భోగాపురంలో దాహం కేకలు

● రెండురోజులకోసారి తాగునీరు విడుదల

● చర్యలు తీసుకోని అధికారులు

భోగాపురం: అన్ని గ్రామాలకు ఇంటింటి కొళాయిల ద్వారా తాగునీరు అందిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతోందే గానీ క్షేత్ర స్థాయిలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. భోగాపురం గ్రామంలో గత కొన్ని రోజులుగా తాగునీరు ఎప్పుడు వస్తుందా అని కొళాయిల వద్ద వేకువ జాము నుంచే కాపలా కాస్తున్నారు. గంటల కొలదీ కాపలా కాస్తే బిందెడు నీరు దొరకడం గగనంగా ఉంది. పంచాయతీలో సుమారు 9,400 జనాభా ఉండగా.. భోగాపురం గ్రామంలోనే సుమారు 6వేల మంది ఉంటున్నారు. ఇక్కడ ప్రజలకు రక్షిత మంచినీటి పథకమే ఆధారం. డెంకాడ మండలం నాతవలస చంపావతి నదిలో ఏర్పాటు చేసిన మోటారు, పైపులైన్లు ద్వారా గ్రామానికి తాగునీరు అందేది. గత కొన్ని రోజులుగా సక్రమంగా సరఫరా కావడం లేదు. రెండురోజులకోసారి.. అది కూడా సుమారు 5 నిమిషాలు మాత్రమే నీరు వస్తోంది. దీంతో ఒక్కో కుటుంబానికి ఒక బిందె నీరు దొరకడం కూడా కష్టమవుతోంది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు ప్రజా సమస్యలపై దృష్టి సారించి తక్షణమే ప్రధానమైన తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నదిలో నీటి నిల్వ లేకపోవడం వల్లే..

దీనిపై పంచాయతీ కార్యదర్శి రామకృష్ణనాయుడును వివరణ కోరగా నదిలో నీటి నిల్వ లేకపోవడంతో తాగునీరు అందించలేకపోతున్నామని చెప్పారు. ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ హేమంత్‌ను వివరణ కోరగా చంపావతి నదిలో నీటి నిల్వలు తగ్గడంతో తాగునీరు సరఫరా సక్రమంగా జరగడం లేదన్నారు. రెండు మూడు రోజుల్లో మరో ఫిల్టర్ పాయింట్ ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేస్తామని తెలిపారు.


కొళాయి వద్ద ఉంచిన బిందెలు


బోరు నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న దృశ్యం

గ్రంథాలయాల్లో వేసవి శిక్షణా శిబిరాలు


గరివిడి: విద్యార్థులకు కథలు చెబుతున్న విశ్రాంత ఉపాధ్యాయుడు పాపారావు


పాలకొండ: బొమ్మల తయారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం


గరుగుబిల్లి: పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

గరివిడి: స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణా శిబిరం ప్రారంభించారు. ఈ శిబిరాన్ని జూన్ 11వరకు నిర్వహిస్తామని గ్రంథాలయ నిర్వాహకురాలు ఉషారాణి తెలిపారు. కథలు చెప్పడం, పుస్తక పఠనం, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు మొదలైనవి ఉంటాయని, విద్యార్థులందరూ ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు కె.పాపారావు విద్యార్థులకు నీతి కథలు చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ● **పాలకొండ:** వేసవి సెలవుల్లో విద్యార్థులు, చిన్నారులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబు కోరారు. స్థానిక గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణా శిబిరం నిర్వహించారు. కళా అంకురం డైరెక్టర్ ఫ్యాషన్ డిజైనర్ కుమారి అల్లు ప్రియాంక పిల్లలకు చిన్న అల్లికలు, దారంతో కొన్ని రకాల బొమ్మలు ఎలా తయారు చేయాలో చెప్పారు. అనంతరం పిల్లలకు కథల పుస్తకాలు చదివించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు. ● **చీపురుపల్లి:** స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా గురువారం జరిగిన కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక సభ్యుడు వావిలపల్లి మోహనరావు మాట్లాడుతూ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఈ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎ.బుచ్చెన్నాయుడు, గొర్లె రమణ తదితరులు పాల్గొన్నారు. ● **గరుగుబిల్లి:** రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ సంచాలకుడు ప్రసన్నకుమార్ ఉత్తర్వుల మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బోనెల లక్ష్మి ఆదేశాలతో మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం పుస్తక పఠనం నిర్వహించారు. క్విజ్ పోటీలు, ఆటల పోటీలు, తదితర కార్యక్రమాలను ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నామని నిర్వాహకుడు నల్ల మధుసూదనరావు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలను కలిసి ఈ వేసవి శిక్షణ శిబిరంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా చర్యలు చేపట్టామని చెప్పారు. ● **గుర్ల:** ప్రతి విద్యార్థి ఉల్లాసంగా ఉండాలని లైబ్రేరియన్, ఉపాధ్యాయుడు రామారావు సూచించారు. గురువారం మండలంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు ప్రారంభించారు. క్విజ్, వ్యాసరచన, ఆటలు పోటీలు నిర్వహించారు.


గుర్ల: వేసవి తరగతులకు హాజరైన విద్యార్థులు

20న వేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవం

సీతంపేట: సీతంపేటలోని తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీవేంకటేశ్వర ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఈనెల 20న నిర్వహిస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆరు గంటలకు సుప్రభాతసేవ, సహస్ర నామార్చన, ఉదయం 9 గంటల నుంచి విశేష కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు.

ఘనంగా జైగురుదత్త హోమాలు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిరిడీ సాయి బాబా ఆలయంలో గురువారం జైగురుదత్త హోమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, కాగడ హారతి, తదితర పూజల అనంతరం జైగురుదత్త హోమాలు నిర్వహించారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

24 గంటల్లో చోరీ కేసు ఛేదన


బాధితులకు ఆభరణాలు అందజేస్తున్న పోలీసులు

రాయగడ: చోరీ జరిగిన 24 గంటల్లో రాయగడ పోలీసులు కేసును ఛేదించారు. దీనికి సంబంధించిన వివరాలను గురువారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎస్‌డీపీవో ఆర్.సేనాపతి వివరించారు. స్థానిక గోదా బరీస్ నగర్‌లో నివాశముంటున్న సంతోష్‌గౌడో వేసవి వేడికి ఇంటి తలుపులు తెరిచి ఉంచి ఆరుబయట నిద్రిరించారు. ఇంటి తలుపులు తెరిచిఉండడంతో బుధవారం వేకువ ఝామున దొంగలు పడి బీరువాను పగలకొట్టి బంగారు గొలుసు, చెవి దుద్దులు, వెండి ఆభరణాలు, ఏడు సెల్‌ఫోన్లు దోచుకుపోయారు. గురువారం ఉద యం చోరీ జరిగినట్టు గుర్తించిన సంతోష్ గౌడో పోలీసులకు ఫిర్యా దు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. రెల్లి వీధికి చెందిన సుండి బుల్లు అనే యువకుడిని నిందితుడిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి చోరీకి గురైన ఆభరణాలను స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒడిశా

ప్రభుత్వ లాంఛనాలతో డొంబురుధర అంత్యక్రియలు


నివాళులర్పిస్తున్న దృశ్యం

రాయగడ: పూర్వ మంత్రి డొంబురుధర ఉలకా అంత్యక్రియలను గురువారం బంకిలి శ్మశానవాటికలో ప్రభుత్వ లాంఛనాలతో పూర్తి చేశారు. ఉలకా 1974 నుంచి 1985 వరకు మళ్లీ 1995, 2004 నుంచి 2009 వరకు బిసంకటక్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించారు. 1985లో జరిగిన ఎన్నికల్లో గెలుపొంది రాష్ట్ర మంత్రి వర్గంలో స్థానం పొందారు. కొంత కాలంగా అనారో గ్యంతో చికిత్స పొందుతున్న ఆయన ఈనెల 14 అర్ధరాత్రి భువనేశ్వర్ లోని అయన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. బంధువులు ఉలకా స్వగ్రామంలో అంతమ సంస్కారాలు నిర్వహించేందుకు నిర్ణయంచడంతో గురువారం ఉలక భౌతిక కాయాన్ని బంకిలీ తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. కలెక్టర్ సత్యవాన్ మహాజన్ ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలకు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్ త్రినాథ్ మాఝి, ఏఎస్పీ బిష్ణుప్రసాద్ సేఠి, మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గొమాంగ్, పూర్వ పార్లమెంటు సభ్యురాలు హేమాగొమాంగ్, జిన్నుహికాక, జయరాం పంగి, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదిలి, డీపీఆర్వో బసంతకుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.